క్లుప్తంగా

పకడ్బందీగా సర్వే చేయండి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ వరప్రసాద్

సదుం: మండలంలో త్వరలో నిర్వహించనున్న నైపుణ్య గణన సర్వేని పకడ్బందీగా చేయాలని ఈఓపీఆర్డీ వరప్రసాద్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. 15 నుంచి 59 సంవత్సరాల లోపు ఉన్న వారి విద్యార్హత, ఉద్యోగం, నైపుణ్యం, స్వయం ఉపాధి, వ్యాపారం తదితర వాటి వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు.

మార్కెట్ వేళల్లో మార్పు



కుప్పం రూరల్: కుప్పం మార్కెట్ యార్డులు నిర్వహిస్తున్న దినసరి కూరగాయల మార్కెట్ పనివేళల్లో మార్పులు చేసినట్లు వ్యాపారుల అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 13 బుధవారం నుంచి టెంకాయలు, కూరగాయల వ్యాపారం ఉదయం 6 నుంచి మొదలవుతుందని తెలిపారు. 6 గంటలకు ముందు ఎలాంటి వ్యాపార లావాదేవీలు ఉండవన్నారు. టమాట వ్యాపారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఆ తరువాత వచ్చిన సరుకు మరుసటి రోజు క్రయ విక్రయాలకు అనుమతిస్తామన్నారు. దీంతో పాటు ప్రతి శుక్రవారం కూరగాయల మార్కెట్ సెలవుగా ప్రకటించారు. రైతులు, వ్యాపారులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

సదుం: భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీటీ కుమార్ తెలిపారు. మండలంలోని ఊటుపల్లెలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. సమస్యలపై రైతుల నుంచి 312 ఫిర్యాదులు అందాయని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగభూషణం, నవీన్ పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

గంగవరం: నిరుద్యోగ యువతీ యువకుల కోసం జాబ్‌మేళాను పలమనేరులోని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, (సీడాప్), డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ లిమిటెడ్(ఇండస్ ఇన్ బ్యాంక్), శ్రీరామ్ చిట్స్, దొడ్ల డెయిరీ, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారన్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్/పాస్, డెయిరీ టెక్నాలజీ కోర్సు చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపు యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సంప్రదించాల్సిన సెల్ నంబర్లు: 8465830771, 9963561755

యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పంలో అక్రమ బియ్యం రవాణా మూడు టెంపోలు... ఆరు సుమోలు.. అన్న చందాన సాగుతోంది. తమిళనాడులో సేకరించిన చేసిన బియ్యం కుప్పం మీదుగా కర్ణాటకకు నిత్యం రవాణా చేస్తున్నారు. ఈ అక్రమ రవాణా నానాటికీ పెరిగిపోవడంతో తరచూ తమిళ అధికారులు వచ్చి కుప్పంలో దాడులు చేస్తున్నారు. తమిళనాడు బియ్యం స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్నా స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. అక్రమ రవాణాలో ఎక్కువగా కూటమి నేతలు ఉండడమే దీనికి కారణమనే విమర్శలొస్తున్నాయి.

- తమిళనాడు టు కర్ణాటక వయా కుప్పం
- తరచూ కుప్పంలో తమిళ అధికారులు దాడులు
- కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక జోరందుకున్న అక్రమ రవాణా
- నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు
- అక్రమ రవాణాలో తమ్ముళ్లదే ముఖ్య భూమిక




తమిళ అధికారులు దాడులు చేసి అరెస్ట్ చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న బియ్యం (ఫైల్)




గత నెల పట్టపగలే కుప్పంలో బియ్యం తరలిస్తుండగా పట్టుబడిన ఈచర్ వాహనం (ఫైల్), తమిళ అధికారులు స్వాధీనం చేసుకున్న సుమో (ఫైల్)

కుప్పం రూరల్: తమిళనాడులో ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని అక్రమార్కులు సేకరించి కుప్పం మీదుగా కర్ణాటకలోని బంగారుపేట మిల్లులకు తరలించి లక్షలు ఆర్జిస్తున్నారు. తమిళనాడులోని ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలు తిరుపత్తూరు, వాణియంబాడి, ఆంబూరు, వేలూరు చుట్టు పక్కల గ్రామాల్లో అధిక మొత్తం తమిళ బియ్యం సేకరిస్తున్నారు. నాలుగైదు టన్నులు అయిన తరువాత కుప్పం మీదుగా బంగారుపేటకు తరలిస్తున్నారు. తమిళనాడులో కిలో బియ్యం రూ.20కు కొనుగోలు చేసి బంగారుపేటలో రూ.30కు విక్రయిస్తున్నారు. కిలోపై రూ.10 లాభం వస్తుండడంతో రోజుకో అక్రమార్కుడు పుట్టుకొస్తున్నాడు. దీనికి తోడు కుప్పం ప్రాంతంలో మన రాష్ట్ర రేషన్ బియ్యాన్ని మహిళల ద్వారా రూ.25కు కొనుగోలు చేసి అక్కడ 31కు అమ్ముతున్నారు. ఇలా తమిళ, ఆంధ్ర బియ్యాల అక్రమ రవాణా రేయింబవళ్లూ యథేచ్ఛగా కొనసాగుతోంది.

అక్రమ రవాణాలో కూటమి నేతలదే హవా

బియ్యం అక్రమ రవాణాలో కూటమి నేతలే ఎక్కువగా ఉన్నారు. కుప్పం మండలం తమిళనాడుకు ఆనుకుని ఉండడంతో వారికి బాగా అనుకూలిస్తోంది. తమిళనాడు నుంచి కర్ణాటకకు కుప్పం ప్రాంతంలో కూసూరు, నాయనూరు, మల్లానూరు, ఆరిమానుపెంటల మీదుగా అంతర్రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ రహదారుల్లో నిత్యం ఈచర్లు, సుమో, ద్విచక్ర వాహనాల్లో కూటమి నాయకులే జోరుగా అక్రమ రవాణాకు చేస్తున్నారు. దగ్గరుండి వాహనాలను హద్దులు దాటిస్తున్నారు. వీరిలో నియోజక వర్గ, మండలస్థాయి నాయకులు అధికంగా ఉన్నారు.

చోద్యం చూస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

నిత్యం అక్రమ రవాణా సాగుతున్నా, స్థానిక పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తోంది. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ఉన్నా, సమాచారం తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై జనం మండిపడుతున్నారు. ప్రతి నెలా అధికారుల మామూళ్ల సంతర్పణ ఉండడం, మరో వైపు అధికార పార్టీ నాయకులు కావడంతో ఒత్తిళ్ల మూలాన ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కుప్పంలో దాడులు చేస్తున్న తమిళ అధికారులు

తమిళనాడు బియ్యం అధిక మొత్తంలో కుప్పం మీదుగా కర్ణాటకకు చేరుతున్న వైనాన్ని గుర్తించి తిరుపత్తూరు కలెక్టర్ అక్రమ రవాణా నిరోధానికి ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నాట్రంపల్లె తహసీల్దార్ శివసుబ్రమణ్యం, నాట్రంపల్లె టీఎస్ఓ రామన్, ఎస్ఐలు ముత్తు ఈశ్వరన్, సెల్వరాజ్‌లతో ఏర్పాటు చేసిన ఈ బృందం తరచూ కుప్పం ప్రాంతంలో దాడులు చేసి తమిళ బియ్యం స్వాధీనం చేసుకుని అక్రమార్కులను అదుపులోకి తీసుకుంటున్నారు. గత నెల 21న ఈ బృందం కుప్పం మండలం రాగిమానుమిట్టలో దాడులు చేసి కర్ణాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 1800 కిలోల బియ్యం, ఒక సుమో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేశారు. ఇలా తమిళనాడు నుంచి అధికారులు వచ్చి దాడులు చేస్తున్నా స్థానిక అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం చూస్తే అధికార పార్టీ నాయకులకు దాసోహమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

నిరక్షరాస్యతను రూపుమాపుదాం



మాట్లాడుతున్న ఏపీయం హరిప్రసాద్

సదుం: నిరక్షరాస్యతను రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని ఈఓపీఆర్డీ వరప్రసాద్, ఏపీయం హరిప్రసాద్ పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య భవనంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్ టీచర్లకు గురువారం శిక్షణ నిర్వహించారు. మండలంలో మొదటి విడతలో 50 ఏళ్ల లోపు ఉన్న నిరక్షరాస్య మహిళలు 310 మందిని గుర్తించినట్లు వారు చెప్పారు. ప్రతి పది మందికి ఒకరి చొప్పున వలంటీర్ టీచరును ఏర్పాటు చేశామన్నారు. 200 గంటలు వయోజన విద్య అందించి మార్చిలోగా వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని ఏపీయం చెప్పారు. సీసీలు మధుసూదన్ రెడ్డి, భానుకుమార్, మల్లీశ్వరి, సుజాత పాల్గొన్నారు.

'ఉల్లాస్'పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో ఎంపిక చేసిన వలంటీర్లు, వీఓ లీడర్లకు గురువారం ఉల్లాస్(అడల్ట్ ఎడ్యుకేషన్) కార్యక్రమంపై వెలుగు ఏపీఎం మీరాబాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ బాలాజి మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల సభ్యులకు అన్ని రంగాల్లో పరిజ్ఞానాన్ని పెంచేందుకు, నైపుణ్యాభివృద్ధి కోసం ఈ ప్రత్యేక అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వలంటీర్లు సేవాతత్పరతతో ఉల్లాస్‌ను విజయవంతం చేయాలని కోరారు.

పలు కుటుంబాలకు ఓదార్పు



సర్పంచ్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని పలు వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ ఓదార్చారు. తొలుత కమ్మినాయునిపల్లెకు చెందిన సోషల్ మీడియా కన్వీనర్ మనోహర్ రెడ్డి ఇంటికి వెళ్లి మాట్లాడారు. అనంతరం ఇటీవల తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన శంకర్రాయలపేటకు చెందిన వెంకట్రమణ కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

- కూటమి నేతల దాడిలో గాయపడిన ముదరంపల్లెకు చెందిన సుబ్రమణ్యం, బొమ్మరాజుపల్లెకు చెందిన మంజునాథ రెడ్డి కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
- తల్లిని కోల్పోయిన నాగిరెడ్డిపల్లె సర్పంచ్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని ఓదార్చి సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు వైస్ ఎంపీపీ ఆంజమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నాయకులు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



పరమేష్

పుంగనూరు: పట్టణంలోని హిందూ జాగరణ సమితి అధ్యక్షుడిగా పరమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా హరీష్‌ను ఎన్నుకున్నారు. పరమేష్ మాట్లాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

కళాశాలల్లోనూ భోజన పథకం అమలు చేయాలి



నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

పుంగనూరు: కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ, అన్ని ప్రాంతాల వారిని చేర్చి కార్యవర్గంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. విద్యా దీవెన, వసతిదీవెన, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మున్నా, సంజయ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఏఐఎస్ఎఫ్ పట్టణ శాఖ నూతన అధ్యక్షుడిగా సోము, కార్యదర్శిగా గిరీష్, సహాయ కార్యదర్శులుగా సిద్దిక్, మహేష్, ఉపాధ్యక్షులుగా గణేష్, అజయ్, మన్సూర్, కోశాధికారిగా దిల్‌దార్, మహిళా కన్వీనర్లుగా శిరీష, శ్రావణి, సువర్ణ, పల్లవి, రమ్యశ్రీను ఎన్నుకున్నారు.

యువకులకు పోలీసులు వార్నింగ్

సాక్షి ఎఫెక్ట్..



బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలిలో మోటార్ సైక్లిస్టులను ప్రశ్నిస్తున్న ఏఎస్ఐ త్యాగరాజన్

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఎస్ఐ పరుశురాముడు గురువారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. మితిమీరిన వేగం, సైలెన్సర్లకు మఫ్లర్ తీసేసి నడుపుతున్న యువకులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గురువారం సాక్షి దినపత్రికలో 'బైక్ రైడర్ల ఓవరాక్షన్' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఎస్ఐ స్పందించారు. మోటార్ సైకిళ్ల సైలెన్సర్లకు మఫ్లర్ తీసేసి, యువత చేస్తున్న ప్రమాదకర విన్యాసాలపై సాక్షి విపులంగా కథనం వెలువరించింది. దీనిపై దృష్టి సారించిన ఎస్ఐ రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్లు లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారికి జరిమానా విధించారు. యువతకు చిన్నపాటి క్లాసు తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో నడపడం వలన ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని హితోక్తులు పలికారు. ప్రతి ఒక్కరూ దీనిని దృష్టిలో ఉంచుకుని కుటుంబం పట్ల తమ బాధ్యత గురించి గుర్తెరిగి మసలుకోవాలన్నారు. ప్రమాదం జరిగిన జీవితాంతం బాధపడే కన్నా జాగ్రత్తలతో జీవితాన్ని మలచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ త్యాగరాజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరుకు ప్రత్యేక బస్సు సర్వీసులు

- ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం
- బస్సులు ఫుల్ అయినా నో వర్రీ
- సేవలకు అదనపు సర్వీసులు



ఆర్టీసీ డిపో మేనేజర్ టి.కె.స్వామి

గంగవరం: ప్రయాణికుల సౌకర్యార్థం పలమనేరు–బెంగళూరుకు, బెంగళూరు–పలమనేరు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ టీకే.స్వామి గురువారం తెలిపారు. బెంగళూరులో స్థిరపడి ఉద్యోగాలు చేసుకుంటున్న చాలా మంది పలమనేరు ప్రాంత ప్రజలు సెలవు దినాలకు తిరిగి రావడంలో సమయానికి బస్సు సర్వీసులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మధ్య దీపావళి పండుగకు వచ్చిన చాలా మంది ప్రయాణికులు తిరిగి బెంగళూరుకు వెళ్లడానికి ఎంత ఇబ్బంది పడ్డారో తన దృష్టికి రావడంతో దీనిని చిత్తూరు ప్రజా రవాణా సంస్థ అధికారి (డిపిటిఓ)కి నివేదించడంతో స్పందించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు వారాంతంలో శుక్ర, శని, ఆది, సోమవారాల్లో బెంగళూరుకు రాకపోకల నిమిత్తం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని, దీనికి ప్రయాణికులు అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకుని ప్రయాణించాలని, ఒకవేళ బస్సులు ఫుల్ అయినా అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

ల్యాబ్ పరికరాల వితరణ



ల్యాబ్ పరికరాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు

సదుం: సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం రూ. 85 వేల విలువ చేసే ల్యాబ్ పరికరాలను అందజేసినట్లు సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జయకుమార్ రెడ్డి గురువారం తెలిపారు. ఆ పరికరాలతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టరు కరీముల్లా ప్రారంభించారు. విద్యార్థులు బోధన అవసరాల కోసం అందజేసిన వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో కూడా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు హెచ్ఎం చెప్పారు. సందర్భంగా సర్ సీ.వీ. రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సంఘం నాయకులు వెంకటరమణారెడ్డి, శంకర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు బకాయిలు చెల్లించరూ!



మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు

గంగవరం: పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం పాత బకాయిలను వెంటనే చెల్లించాలని పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం పలమనేరులో పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం రత్నారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. పాత బకాయిలు చెల్లించడంతో పాటు పాత అడిషనల్ క్వాంటమ్ శాతాన్ని పునరుద్ధరించి 12వ పీఆర్‌సీ వేసి ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గురుమూర్తి వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. సంఘంలో కొత్తగా సభ్యులుగా చేరిన వెంకటేష్, హరిదాస్, శివకుమార్‌ను పరిచయం చేసి తాత్కాలిక కార్యదర్శిగా దొరస్వామిని ఎన్నుకున్నారు. సమావేశంలో ట్రెజరర్ దవనముని, విజయ్‌కుమార్, రాజన్న, జయపాల్, శేఖర, సుబ్బన్న, పాపయ్య, సిద్ధమనోహర్, కన్నయ్య, రాజారెడ్డి, కస్తూరి, బాబూసాహెబ్, దొరస్వామినాయుడు, మురళీధర్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కొలమాసనపల్లె పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గంగవరం: క్యాన్సర్ బారిన పడకుండా సురక్షితంగా జీవించాలంటే వ్యసనాలకు స్వస్తి పలకాలని పత్తికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. జాతీయ క్యాన్సర్ దినం సందర్భంగా గురువారం క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వ్యసనాలకు బానిసైతే వారి శరీర అవయవాలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడి క్షీణిస్తాయన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ బారిన పడటానికి పొగాకు ఉత్పత్తుల వాడకం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడమే ముఖ్య కారణమన్నారు. అందుకే అందరూ మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉంటే ఏ జబ్బుల బారిన పడరన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రతి గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తారని, 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేసుకుని కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గంగవరం పీహెచ్‌సీలో వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పలమనేరులో...

పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సుధారాణి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గ్రామానికి వైద్య సిబ్బంది వెళ్లి క్యాన్సర్ పరీక్షలు చేస్తారని, 30 ఏళ్ల పైబడిన వాళ్లు ఈ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: క్యాన్సర్ వ్యాధిపై గురువారం రొంపిచెర్లలో వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం చాలా కష్టమన్నారు. 30 ఏళ్ల పైబడిన వారు 6నెలలు, ఏడాదికోసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే క్షయ వ్యాధి రాకుండా 60 ఏళ్ల పైబడిన వారు అడల్ట్ బీసీజీ ఇంజెక్షన్ వేసుకోవాలన్నారు. ఈ నెల 14 నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, దీనిని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే క్యాన్సర్ స్క్రీనింగ్

సదుం: ప్రభుత్వం ప్రతి ఒక్కరి ఇంటి వద్దే క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తుందని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా తెలిపారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య పరీక్షలలో వ్యాధి నిర్ధారణ అయితే సరైన చికిత్సతో నయం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం

బైరెడ్డిపల్లె: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ కోరారు. క్యాన్సర్ వ్యాధిపై గురువారం మండలంలోని తీర్థం పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ, జీర్ణం కాకపోవడం, గుండెల్లో మంట, రాత్రి వేళల్లో చమట పట్టడం, గొంతు, ముక్కు నుంచి రక్తం స్రవించడం, దగ్గు వస్తుండటం, కీళ్ల నొప్పులు, శరీరంలో మార్పులు..మొదలైనవి క్యాన్సర్ లక్షణాలుగా అనుమానించవచ్చన్నారు. ఇలాంటి సమస్యలతో ఎవరైనా బాధపడుతున్న పక్షంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఆరోగ్య సిబ్బంది శ్రీదేవి, రాజారెడ్డి, పూర్ణ, అయూబ్, ఆషా పాల్గొన్నారు.



సదుం: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



గంగవరం: ర్యాలీ చేస్తున్న పత్తికొండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



గంగవరం పీహెచ్‌సీలో..



రొంపిచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



బైరెడ్డిపల్లె: తీర్థం పీహెచ్‌సీలో..

విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే

వి.కోట: మండలంలోని తోటకనుమ వద్ద నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని గురువారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించగా, వి.కోటలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ద్వారా వీక్షించి వీక్షించి జ్యోతి ప్రజల్వన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈ ఉపకేంద్రం ఏర్పాటుతో పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట, బైరెడ్డిపల్లి, కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలాల పరిధిలోని వ్యవసాయం, గృహావసరాలకు మెరుగైన విద్యుత్‌ను ఇవ్వడానికి వీలవుతుందన్నారు. అధిక స్థాయి ఓల్టేజీ సామర్థ్యంతో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం వలన సుమారు 46,000 మందికి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

హర్షం వ్యక్తం చేసిన ప్రజలు

వి.కోట, బైరెడ్డిపల్లె రెండు మండలాల రైతుల దశాబ్దాల కల నెరవేర్చడానికి బీజం వేసిన పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ స్వగ్రామం తోటకనుమ వద్ద గత ప్రభుత్వం 132/ 33 కేవీ ఉపకేంద్రాన్ని నిర్మించింది. దీనిని ఇప్పుడు ప్రారంభించడంతో వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లో విద్యుత్ సమస్యకు చరమగీతం పాడారంటూ హర్షం వ్యక్తం చేశారు.ఎస్ఈ అపరేషన్ ఇస్మాయిల్, పలమనేరు ఆర్డీఓ భవాని, ఈఈ శ్రీనివాస మూర్తి, ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్, ఈఈ చిన్నప్ప, ఏడీ గణేష్, నాయకులు పాల్గొన్నారు.

50 మంది ఉద్యోగాలకు ఎంపిక



గంగవరం: మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ ఎంవీఆర్.రెడ్డి తెలిపారు. ప్రముఖ మల్టీనేషనల్ 'ఫస్ట్ సోర్స్' కంపెనీ తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని చెప్పారు. ఎంపికై న విద్యార్థులు బెంగళూరు, చెన్నైలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని, ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ. 2.75 లక్షలని తెలియజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు అభినందించారు.